# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - బ్రిటన్ దేశాలు సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు.
- ❖ ఉగ్రవాద రహిత జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు.
- ❖ దేశ అభివృద్ధిలో అంకుర పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు.
- ❖ రక్షణ రంగంలో భారత్ ఆస్ట్రేలియా దేశాలు పరస్పరం సహకరించుకుంటాయని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం వేదికగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లో భారత్ దక్షిణాఫ్రికాకు 252 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

====================

భారత్ - బ్రిటన్ దేశాలు సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇరుదేశాల భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక పురోగతికి కీలకమైన పునాదిగా మారుతోందని అభిప్రాయపడ్డారు. ముంబైలో ఈరోజు జరిగిన CEO ఫోరమ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో కలిసి ప్రసంగించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. రెండు దేశాల భాగస్వామ్యం విశ్వసనీయమైనదని అన్నారు. ప్రధాని కీర్ స్టార్మర్ నాయకత్వంలో ఇరు దేశాల సంబంధాలు గణనీయమైన పురోగతిని సాధించాయని చెప్పారు. భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో, రెండు దేశాలకు దిగుమతి ఖర్చు తగ్గుతుందని అన్నారు. యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వాణిజ్యం పెరుగుతుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

భారతదేశ అభివృద్ధి చాలా అద్భుతమైనదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్ ని ఆయన అభినందించారు. భారత్ అభివృద్ధి ప్రయాణంలో బ్రిటన్ భాగస్వామిగా ఉండాలని కోరుకుంటోందని చెప్పారు.

====================

ఉగ్రవాద రహిత జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా పరిస్థితిని సమీక్షించడానికి న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భద్రతా సంస్థల దృఢ సంకల్పం కారణంగా ఉగ్రవాద కార్యకలాపాలు దాదాపుగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. ఈ ప్రయత్నాలను మరింతగా కొనసాగించడానికి అవసరమైన అన్ని వనరులను కేంద్రప్రభుత్వం సమకూరుస్తుందని అమిత్ షా హామీ ఇచ్చారు. శాంతి భద్రతలకు ముప్పు కలిగించే ఏ ప్రయత్నం అయినా  అణిచివేయడానికి భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భద్రతా సంస్థలు తీసుకున్న చర్యలను హోం మంత్రి ప్రశంసించారు. శీతాకాలం ప్రారంభం కావడంతో సరిహద్దు గుండా చొరబడటానికి ఉగ్రవాదులు ప్రయత్నిస్తారని ఆయన పేర్కొంటూ.. వీటిని నియంత్రించేందుకు భద్రతా దళాలు పూర్తి సంసిద్ధంగా ఉండాలని అమిత్ షా కోరారు.

====================

దేశ అభివృద్ధిలో అంకుర పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025 జాతి నిర్మాతల సదస్సులో ఆయన ఈ రోజు పాల్గొని ప్రసంగించారు. 15 సంవత్సరాల క్రితం దేశంలో కొన్ని అంకుర సంస్థలు మాత్రమే ఉండేవని గుర్తు చేశారు. నేడు ఒక లక్షా 80 వేలకు పైగా ఈ పరిశ్రమలు ఉన్నాయని చెప్పారు. మహిళల నేతృత్వంలో దేశంలో 73 వేల అంకుర సంస్థలు ఆవిర్భవించాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ బీహార్‌లో ఈ నెల 11న ఒకరోజు పర్యటనను చేపట్టనున్నారు. ఈ పర్యటనలో భాగంగా భారతరత్న లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ జయంతి సందర్భంగా సరన్ జిల్లాలోని ఆయన పూర్వీకుల గ్రామమైన సితాబ్ డియారాలో ఉపరాష్ట్రపతి నివాళి అర్పిస్తారు.

విరామం

====================

భారతదేశం పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... భారతదేశం ఇప్పటికే గోధుమ, వరి ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించిందని చెప్పారు. దేశంలో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతుందని తెలిపారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం, పంట వైవిధ్యతను ప్రోత్సహించడం, నీటిపారుదల సదుపాయాలను మెరుగుపరచడం వంటివి లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

====================

ఉగ్రవాదం, చర్చలు రెండు కలిపి చూడలేమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో అధికారిక పర్యటన సందర్భంగా కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్‌తో విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారతదేశ వైఖరిని రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు, ఉగ్రవాదం, వాణిజ్యం, నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని పేర్కొన్నారు. భారత్-ఆస్ట్రేలియా సాంస్కృతిక సంబంధాలు బలమైనవని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా సైనిక విన్యాసాలు, సముద్ర భద్రత, రక్షణ పరిశ్రమ సహకారం, శాస్త్ర సాంకేతికతతో సహా విస్తృత పరిధిలో రక్షణ సహకారాన్ని మరింతగా పెంచుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయి.

=====================

అధునాతన సాంకేతికతను వినియోగించడం ద్వారా చట్టసభలు మెరుగైన పనితీరుని కనబరచే అవకాశం ఉందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. బార్బడోస్‌లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశంలో వర్క్ షాప్‌కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే విషయంలో బాధ్యతాయుతమైన, నైతికపరమైన విధానాన్ని అనుసరించాలని కామన్వెల్త్ దేశాల పార్లమెంటు సభ్యులను కోరారు. సాంకేతిక పురోగతి భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధుల్లో ప్రధానమైన మార్పులను తీసుకువచ్చిందని లోక్ సభ స్పీకర్ చెప్పారు. రాబోయే కాలంలో సంసద్ భాషిణి వంటి రియల్-టైమ్ కృత్రిమ అనువాద వ్యవస్థలు ప్రతి పార్లమెంటు సభ్యుడు వారి మాతృ భాషలో సంభాషించే వీలు కల్పిస్తాయని ఓం బిర్లా తెలిపారు.

=====================

రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గుజరాత్ రాష్ట్రం మెహ్సానాలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వస్థలమైన వాద్ నగర్‌ను ఈ రోజు సందర్శించారు. వాద్ నగర్ రైల్వే స్టేషన్‌లోని మౌలిక సౌకర్యాలను కేంద్రమంత్రి పరిశీలించారు. అంతకుముందు అహ్మదాబాద్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను కూడా ఆయన పర్యవేక్షించారు.

=====================

భారత్ ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి పోటీతత్వ సమాఖ్యవాదం సరైన విధానమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన పిహెచ్‌డి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 120వ వార్షిక సమావేశంలో ఆయన ఈ రోజు ప్రసంగిస్తూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించారని అన్నారు. కేంద్రప్రభుత్వ నిధులతో నడిచే అనేక పథకాలను స్థానికంగా అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేశామని చెప్పారు. జాతీయ అభివృద్ధికి స్థానిక స్థాయిలో అభివృద్ధి కీలకమని కేంద్రమంత్రి తెలిపారు.

=====================

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం వేదికగా భారత్ దక్షిణ ఆఫ్రికా జట్ల మధ్య మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ దక్షిణాఫ్రికా కు 252 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది. భారత ప్లేయర్లలో రిచా ఘోష్ అత్యధికంగా 94 పరుగులతో రాణించింది. ఇక లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 6 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టపోయి 20 పరుగులు చేసింది.

=====================
=====================